# దైవ విశ్వాసం, దేశాభిమానం పెంచుకోండి!

ఈనాడు మన ఎమ్.బి.ఎ. విద్యార్థులు తమ బిజినెస్ మేనేజిమెంటు విభాగంయొక్క వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అసలు 'బిజినెస్' (వ్యాపారం) అంటే ఏమిటి? ఒక వస్తువునిచ్చి మరొక వస్తువును తీసుకోవడమా? కాదు. ప్రపంచమంతా జరుగుతున్నది బిజినెస్సే! ప్రైమ్ మినిష్టర్ మొదలుకొని పనివానివరకు ప్రతి ఒక్కరూ చేసేది బిజినెస్సే! ఎవరికి తగిన పద్ధతిని వారు చక్కగా అనుసరిస్తున్నారు. మానవునికి గల ఐదు ఇంద్రియములుకూడను నిరంతరం బిజినెస్ చేస్తూనే ఉన్నాయి. ఏఏ అంగములకు సంబంధించినటువంటి బిజినెస్‌ను ఆయా అంగములు తు.చ. తప్పక అనుసరిస్తున్నాయి. ఎవరైతే తమ పంచేంద్రియములను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి వాటిని సరియైనరీతిగా అనుభవిస్తారో వారే ప్రథమ శ్రేణికి చెందినవారు.

**బిజినెస్ విషయాల్లో దేశాన్ని, సంస్కృతిని దృష్టిలో పెట్టుకోవాలి**

కేవలం గ్రంథములు పఠించి, పేపర్లు చదివి, విదేశములయొక్క వ్యాపార పద్ధతులను గుర్తించి, మన భారతదేశములో జరిగే వ్యాపారములను వాటితో పోల్చుకుంటూ చేసే బిజినెస్ సరియైన బిజినెస్ కాదు. మన ఇండియన్ బిజినెస్ భారతీయ సంస్కృతికి, విలువలకు కట్టుబడి ఉండాలి. మనము విదేశీయులతో ఏమాత్రము పోల్చుకోకూడదు. మన దేశముయొక్క స్థితిగతులను మనము దృష్టిలో పెట్టుకోవాలి. ఇతర దేశస్థులు తమయొక్క పవర్‌ను అభివృద్ధిపరచుకొనే నిమిత్తమై అనేకరకములైన మార్పులు చేస్తున్నారు. కాని, మనము అవిధమైన అనుకరణకు పూనుకోకూడదు. మన భావములకు, మన చర్యలకు, మన కుల పద్ధతులకు, మన ఆచారములకు తగినటువంటివి మనము నేర్చుకోవాలి. డబ్బును మాత్రమే దృష్టిలో పెట్టుకుంటే ప్రయోజనము లేదు. సంస్కృతినికూడా చూడాలి.

srisathyasaivachanamrutam

సంస్కృతితోపాటు దేశాన్నికూడా దృష్టిలో పెట్టుకోవాలి.

సంస్కృతి అంటే ఏమిటి? మన ప్రాచీనులయొక్క పద్ధతిని, మన భారతీయుల యొక్క సంప్రదాయములను చక్కగా గుర్తించి వర్తించడమే! బిజినెస్ విషయాల్లో మన సంస్కృతిని మనం ఏమాత్రము వదలడానికి వీల్లేదు. Culture & Country – ఈ రెండింటికీ తగినట్లుగా ప్రవర్తించడమే నిజమైన మానవత్వము. అయితే, culture (సంస్కృతి) అనేది అభ్యాసముచేత, లేక సంబంధ బాంధవ్యములచేత ఏర్పడేది కాదు. 'ఇది మంచి, ఇది చెడ్డ' అనే విచారణను బట్టి, విచక్షణను బట్టి మన హృదయమునుంచియే సంస్కృతి ఏర్పడుతుంది. కాని, అటువంటి 'డిస్క్రిమినేషన్' (విచక్షణ) లేకపోవడంచేత ఈనాడు culture పాడైపోతున్నది. culture పాడైపోవడంవల్ల country (దేశము) చాలా బలహీనమైపోతున్నది. దేశము బలహీనము కావడానికి కారణం ప్రజలు తమ సంస్కృతిని తాము సక్రమంగా అనుసరించకపోవడమే! మీకు తెలుసు – ఈనాడు ఒక్కొక్క పార్టీవారు ఒక్కొక్క సంస్కృతిని, ఒక్కొక్క భావమును అనుసరిస్తూ వస్తున్నారు. అందరూ కలిసి సమైక్యంగా పని చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

**విద్యార్థి దశలో పాటలద్వారా ప్రజల్లో మార్పు తెప్పిస్తూ వచ్చాను**

ఈ దేహం విద్యార్థి దశలో ఉండగా ఒకనాడు బుక్కపట్నంనుండి ఒక రాజకీయ నాయకుడు వచ్చి, "బాబూ! నీవు మంచి కవిత్వం వ్రాస్తావట. మన వీరులను ఉత్తేజపరచేవిధంగా ఒక పాట వ్రాయాలి" అని కోరాడు. వాళ్ళు బుక్కపట్నంలో ఒక సభ ఏర్పాటు చేసుకున్నారు. అవి రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. భారతదేశం బ్రిటీషువారి పరిపాలనలో ఉంది. ఆనాటి పరిస్థితికి తగినట్లుగా నేనొక పాట వ్రాశాను. స్టేజిపైన ఉయ్యాల తొట్టెలో ఒక రబ్బరుబొమ్మను పెట్టి ఊపుతూ ఆ పాట పాడాను.

**ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ!**
**ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా...జో...జో...**
**హంతకుడు హిట్లరు అమర రష్యాపై**
**దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా...జో...జో...**

sri sathyasai vahini / vachanamrutam

**హిట్లరును చంపుటకు ఎఱ్ఱసైన్యంబు**
**వీరుడౌ స్టాలిను కలరు ఏడువకు...జో...జో...**
**ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు?**
**ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా**
**ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి**
**స్వాతంత్ర్యమును పొందగలరు ఏడువకు**
**...జో... జో...**

ఆరోజుల్లో నేను ప్రజలలో ఫ్యాషన్లపై మోజును పోగొట్టి పవిత్రమైన భావాలు పెంపొందేవిధంగా పాటలు వ్రాసేవాడిని. గ్రామంలో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో కనిపెట్టి, తగిన పాటలు వ్రాసి, వాళ్ళ ఇళ్ళ ముందర పిల్లలచేత పాడించి, వాళ్ళకి బుద్ధి వచ్చేలా చేశాను. అప్పట్లో చేతికి గడియారం పెట్టుకోవడం పల్లెల్లో ఒక గొప్ప ఫ్యాషన్‌గా భావించేవారు. అంతేకాకుండా, 'హిట్లర్ మీసాల'ని ముక్కుకింద పిడుదుల మాదిరి పెట్టుకునేవారు. అటువంటివాళ్ళకు బుద్ధి చెప్పడానికి ఇలా వ్రాశాను:

**ఎడమచేతి కడాన ఏందొ తెల్లెల బిళ్ళ**
**తోలు పట్టెడ కట్టి యాలాడగడతారు**
**ఏటి యేషాలప్ప ఇవి?**
**కంటితో చూచేకికాని అవతారాలు**
**ఏటి యేషాలప్ప ఇవి?**
**పొడుగాటి మీసముల్ గొరిగి కత్రించి**
**నాసికముల్ దగ్గ నాల్గుంచుకుంటారు**
**ఏటి యేషాలప్ప ఇవి?**

"ఏమిటి నాయనా ఈ వేషం! ముక్కుకింద ఈగలు వ్రాలినట్లు కనిపిస్తున్నది. ఇది మంచిది కాదు" అని వాళ్ళకు నచ్చజెప్పాను. ఈ ఫ్యాషన్లు అప్పటికప్పుడు వచ్చినవి కావు. ఒకరిని చూసి ఒకరు అనుకరిస్తూ వచ్చారు. ఇంక, ఆడవారు మంగళకరమైన పసుపు కుంకుమలు మానివేసి, కనిపించి కనిపించనట్లుగా చిన్న చుక్క పెట్టుకోవడం ప్రారంభించారు. అయితే,



sri sathyasai vachanamrutam

ఈ ఫ్యాషన్‌లు ఎంతకాలం వచ్చాయి? కొంతకాలమే! పిల్లలు, పెద్దలుకూడను మూడుమూడు దినాలకు ఈ ఫ్యాషన్‌లను మార్చుకుంటూ వచ్చారు. మీకందరికీ తెలుసు – మగపిల్లలు మొట్టమొదట బెల్‌బాటమ్ ప్యాంట్లు వేసేవారు. అది పైభాగంలో టైట్‌గాను, క్రింద చూస్తే లూజ్‌గాను ఉంటుంది. ఆ ఫ్యాషన్ కొద్ది దినాలు నడిచింది. ఆ తరువాత ఒంటికి అంటుకొనిపోయి పైపుల మాదిరి కనిపించే 'టైట్ ప్యాంట్స్' వాడుకలోకి వచ్చాయి. ఆ తరువాత క్రమక్రమేణ 'ఇవేవీ మంచివి కావు' అని గుర్తించి సాధారణమైన డ్రస్సులు వేస్తూ వచ్చారు. ఈవిధంగా, ఫ్యాషన్లపై మోజుతో జనులు మధ్యమధ్యలో అనవసరమైన వేషాలు వేస్తుంటారు. ఇవన్నీ కదిలిపోయే మేఘాలవంటివి. మనిషి మనిషిగా బ్రతకడం నేర్చుకోవాలి.

ఈనాడు మనము భుజించే ఆహారములోగాని, ఉపయోగించే వస్తువులలో గాని అనేకరకములుగా మార్పులు రావడంవల్ల అనేక రోగాలు ప్రారంభ మవుతున్నాయి. పూర్వం మట్టితో తయారుచేసిన కుండలు, తట్టలు, చెంబులు ఇలాంటివన్నీ ఉపయోగించేవారు. కాని, కొంతకాలం తరువాత వాటి స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీలు వస్తువులు వాడుకలోకి వచ్చాయి. ఇప్పుడు ప్లాస్టిక్ బ్యాగ్సు, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగిస్తున్నారు. ఇవి ఎక్కడ ఏ భూమిలో వేసినా ఎన్ని సంవత్సరములైనా అట్లనే ఉంటాయి. దానివల్ల భూములు పాడైపోతున్నాయి. అటువంటి భూముల్లో పండించిన కూరగాయలు మనిషి ఆరోగ్యానికి హానికరంగా పరిణమిస్తున్నాయి.

**సత్యసాయి విద్యావిధానమువల్లనే అభివృద్ధి సాధ్యం**

ఈనాడు ప్రభుత్వంవారు విద్యారంగంలోకూడా అనేక మార్పులు చేస్తున్నారు. అధికారులు ఎన్నైనా మార్చవచ్చు. కాని, దానికి తగినటువంటి టీచర్లను తయారు చేస్తున్నారా? లేదు. టీచర్లు లేనప్పుడు పిల్లలు ఏవిధంగా నేర్చుకుంటారు? మొట్టమొదట క్వాలిఫైడ్ టీచర్లు కావాలి. అలాంటి టీచర్లను తయారు చేయడానికి మన యూనివర్సిటీలో అనేకవిధములైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీచరు మంచిగా ఉంటేనే పిల్లలు మంచివారవుతారు. పిల్లల మంచి చెడ్డలు టీచర్లపైన ఆధారపడి ఉంటాయి.



srisathyasaivahanamritam

మన విద్యావిధానములో ఎట్టి మార్పులూ, ఎట్టి అనుకరణలూ చేయ కూడదు. మన పద్ధతిని మనము అనుసరిస్తే వర్తమానంలో అనుభవిస్తున్న ఆనందమునే భవిష్యత్తులోకూడా అనుభవించవచ్చును. ఈనాడు అనేకమంది భవిష్యత్తుకోసం ఏవేవో ప్లాన్లు వేస్తున్నారు. భవిష్యత్తు అనేది వర్తమానముపై ఆధారపడి ఉంది. Do not brood over past; don't worry about future. Past is past; forget the past. (గతాన్నిగురించి చింతించకండి. భవిష్యత్తును గురించి ఆందోళన చెందకండి). Present (వర్తమానము) ప్రధానమైనది. భూత, భవిష్యత్కాలములు రెండూ వర్తమానములో ఇమిడి ఉన్నాయి. కాబట్టి, ఇది ordinary present కాదు, omnipresent. దీనిని మనము సద్వినియోగం చేసుకోవాలి. ఈ వర్తమానములో సరియైన పద్ధతిని అనుసరించేది ఒక్క సత్యసాయి కాలేజి తప్ప మరొకటి లేదు. చూచుటకు ఇది పల్లె జీవితంగా కనిపించవచ్చుగాని, దీనివల్ల భవిష్యత్తులో మీకు ఎంతనో అభివృద్ధి కలుగుతుంది. కాబట్టి, మీరు సత్యసాయి విద్యా విధానమును ఏమాత్రం మార్చకండి.

చాలామంది గతాన్నిగురించి, భవిష్యత్తునుగురించి చింతిస్తూ వర్తమాన జీవితంలో భ్రష్టుపట్టిపోతున్నారు. భవిష్యత్తునుగురించి చింతించడంలో మనకు సుఖము లేదు. 'గతం గతః' అందులో ఎంతవరకు సుఖపడ్డారు? కాబట్టి, వర్తమానములో మీరు ఆనందంగా ఉండండి. ధనము పోతే నష్టం లేదు. కాని, గుణమును కాపాడుకోవాలి. సద్గుణములను అలవర్చుకున్నప్పుడే మీ మైండు 'స్టెడీ' (నిశ్చలం)గా ఉంటుంది. అదే చాలా ఉత్తమమైనటువంటి మైండు. మనస్సు వల్లనే మనిషి చాలా మార్పుచెందుతూ వస్తాడు. తల్లిదండ్రులుకూడను 'ప్రెజెంటు' (వర్తమానము)ను సద్వినియోగం చేసుకొమ్మని తమ పిల్లలకు బోధించడం లేదు. ఇంక ఎన్ని చేసి ప్రయోజనమేమిటి?! మన పిల్లలు మాత్రం 'ప్రెజెంటు'ను సద్వినియోగపరచుకొని ఎన్నోవిధాలుగా అభివృద్ధి పొందుతున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ 'ప్రెజెంటు'లో మనం చేయవలసింది ఏమిటి? కోరికలను తగ్గించుకోవాలి. Less luggage, more comfort makes travel a pleasure. గతాన్ని గురించి



srisathyasaivachanamrutam

చింతించకూడదు. అది మనకు ఏమాత్రం ఉపకారం చేయదు. 'ప్రెజెంటు'లో మన జీవితాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిపరచుకోవాలి. ఈ 'ప్రెజెంటు' అనేది ఎంత గొప్ప పదమో మీరు యోచన చేసుకోండి. 'ప్రెజెంటు' అంటే ఏమిటి? 'క్లాసులో ఉన్నాడు' అని అర్థము. క్లాసులో లేనివాడు 'ఆబ్సెంటు'. అది విలువను తగ్గిస్తుంది. ప్రతి ఒక్క విషయంలోను 'ప్రెజెంటు' అనేది మంచిది. కనుక, మీరందరూ 'ప్రెజెంటు'ను దృష్టిలో పెట్టుకోండి. ఈనాటి పెద్దలు, 'అయ్యో, మా పూర్వకాలం ఎంతో బాగుండేది. ఇప్పుడు అంతా చెడిపోయింది' అని అంటుంటారు. నిజమే! ఆనాడు పిల్లలు పెద్దలను గౌరవించేవారు. వారితో ఎంతో మర్యాదగా ప్రవర్తించేవారు. వారినుండి హితోపదేశములను అందుకొనేవారు. అసలు టీచర్లవరకు వెళ్లే అవసరం ఉండేది కాదు. ఇంట్లోనే 'గ్రాండ్ మదర్స్' పిల్లలకు ఎంతో మంచి విషయాలను బోధించేవారు. అందరూ ఎంతో ఆనందంగా ఉండేవారు. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అన్నట్లు పాతవారే బంగారం లాంటివారు. వారెంతో ఉత్తమమైన మార్గమును బోధించినటువంటివారు. ఇట్టి పవిత్రమైన మార్గమును ఈనాడు మనము చెడగొట్టుకోకుండా చూసుకోవాలి.

**సుభాష్ చంద్రబోస్‌వంటివారు దేశానికి ఎంతో అవసరం**

మొట్టమొదట కోపము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణములను దూరం చేసుకోవాలి. అప్పుడే మనము 'యూనిటీ'ద్వారా ఎంతో సాధించవచ్చును. ఇప్పుడు లోకంలో ఎక్కడ చూసినా కలహములే! ఎవరిని చూసినా కోపమే! ఎవరితో మాట్లాడినా విరుద్ధమే! ఎక్కడ చూసినా – 'నో యూనిటీ!' 'నో ప్యూరిటీ!' అంతా 'ఎనిమిటీ!' అందుచేతనే ఆనాడు సుభాష్ చంద్రబోస్ దేశాన్ని వదలిపెట్టి బయటికి వెళ్ళవలసి వచ్చింది. 'ఎనిమిటీ' (శత్రుత్వం) ఎప్పుడు వస్తుంది? స్వార్థము వచ్చినప్పుడే 'ఎనిమిటీ' వస్తుంది. అయితే, అతను ఎక్కడికి వెళ్ళినప్పటికీ ప్రజలకు చేయవలసినటువంటి సేవను చక్కగా, నిర్భయంగా చేస్తూ వచ్చాడు. అటువంటి మంచివారు మన దేశానికి ఎంతో అవసరం. మన టీచర్లు నాదగ్గరకు వచ్చి, "స్వామీ, మన యూనివర్సిటీలో మంచిమంచి పిల్లలున్నారు. క్లాసులో మంచి మార్కులు తెచ్చుకునే పిల్లలున్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన పిల్లలను వాళ్ళ తల్లిదండ్రులు విదేశాలకు పంపుతున్నారే!" అని బాధపడ్డారు. ఎందుకు పంపాలి? వాళ్ళను

sri sathyasai vahini vachanamrutam

మన దేశమునందే పెట్టుకొని దేశ ప్రజలను సరియైనరీతిగా తీర్చిదిద్దవచ్చును కదా! విదేశాలలో నెలకు పదివేల రూపాయలు సంపాదించే బదులు మన దేశములో వెయ్యి రూపాయలు సంపాదించినా చాలు. విదేశాల్లో సంపాదించే డబ్బులో అర్ధభాగము ఇంటి అద్దెకే సరిపోతుంది. మిగిలినవాటి వెలకూడా చాలా ఎక్కువ. మంచినీరు దొరకడంకూడా చాలా కష్టం. ప్రతిదానికీ విదేశాల్లో కష్టమే! ఒక అరటిపండు కొనాలంటే, పది రూపాయలు! ఎక్కడినుండి తెచ్చి పెడతావు ఇవన్నీ? బిడ్డలను ఏవిధంగా సాకుతావు? సాధ్యం కాదు. మన ఇంటిలో ఇంత అన్నం వండి పచ్చడి వేసి పెట్టినా అది తిని పిల్లలు ఎంతో సంతృప్తిగా ఉంటారు. ఇట్టి సులభంగా ఉన్న జీవితాన్ని విడిచిపెట్టి మీరు కష్టానికి ఓర్చుకొని విదేశాలకు వెళ్లాలని ఆశిస్తున్నారు.

**మన భావాలు మంచివైతే క్రూరమృగాలుకూడా మనతో మంచిగా ప్రవర్తిస్తాయి**

ఇంతకాలమైనా నేను ఎక్కడా విదేశాలకు పోలేదు. ఐతే, ఒక్కసారి తూర్పు ఆఫ్రికాకు మాత్రం వెళ్లినాను. అక్కడ నేను అడవిలో మృగాలను చూసుకుంటూ, వాటికున్న గొప్ప గుణములను గమనిస్తూ వచ్చాను. అక్కడ ఏనుగులున్నాయి. ఎంత గొప్పగా ఉన్నాయి! ఎంత అందంగా ఉన్నాయి! వాటి చెవులు పెద్ద చేటల మాదిరి ఉన్నాయి. అవి ఒక్కతూరి చెవులు అల్లాడిస్తే ఎంతో దూరంలో ఉన్న దోమలుకూడా ఎగిరిపోతాయి. నేను ఆ ఏనుగుల దగ్గరకు వెళ్ళి పండ్లు ఇచ్చాను. అవి ఆనందంగా అందుకున్నాయి. ఇంక జీబ్రాలున్నాయి; జిరాఫీలున్నాయి. ఎంత ఆనందంగా ఉన్నాయో! ఆ అడవిలో ఉన్న మృగాల్లో ఏవికూడను మానవుణ్ని బాధించేటటువంటివి కావు. ఈనాటి మానవునియొక్క దుర్గుణములే ఈ పశు, పక్షి, మృగాదులలో మార్పు తెస్తున్నాయి. వాటికి మనమేమైనా హాని తలపెడితే అవి మనకు హాని చేస్తాయిగాని, మనమేమీ చేయకపోతే అవి పెంపుడు జంతువులమాదిరి మనవెంట వస్తాయి. ఆ అడవిలో ఒకచోట కొన్ని సింహములు, వాటి పిల్లలు కూర్చున్నాయి. మేము వాటికి దగ్గరగా వెళ్ళినా అవి కదలలేదు. మమ్మల్ని ఆనందంగా చూస్తూ అక్కడే కూర్చున్నాయి. ఆవిధంగా క్రూరమృగాలు కూడను ఎంతో మంచిగా ప్రవర్తించాయి. 'యద్భావం తద్భవతి'. మన భావములను పురస్కరించుకొనియే అవి ఆవిధంగా ప్రవర్తిస్తాయి. పాములు కూడా అంతే! మన ప్రక్కలోనే వచ్చి పండుకుంటాయి కాని ఏమీ

srisathyasaivechanamrutam

చేయవు. తరువాత వాటి పాటికి అవి వెళ్ళిపోతాయి. కాని, మన భావములలో దోషం ఉంటే మనం ఎంతో ప్రేమతో పెంచినటువంటి ఆవుకూడను మనల్ని పొడిచేందుకు వస్తుంది. ఒక వ్యక్తి నీపైన కోపంగా ఉన్నాడంటే, కారణమేమిటి? అది నీ భావములయొక్క రియాక్షను, రిసౌండు, రిఫ్లెక్షనే!

**బంగారానికైనా వెల తగ్గుతుందిగాని మంచితనానికి ఏనాటికీ వెల తగ్గదు**

ఈనాడు ఒకే తల్లికి పుట్టిన బిడ్డలుకూడను ఒకరితో ఒకరు జగడాలు వేసుకుంటారు. ఈవిధంగా ఒకరినొకరు ద్వేషించుకోవడానికి కారణమేమిటి? వారి వారి దుర్బుద్ధులే! ఆవిధమైన దుర్బుద్ధులను మనము నేర్చుకోకూడదు. ఇక్కడ మీరు మంచి కాలేజీలో చదువుతున్నారు. మీ మంచితనముతో ఈ కాలేజీ మంచిపేరును నిల్పుకోవాలి. మీకు 'మంచి పిల్లలు' అని పేరు రావాలంటే మీరు మంచివారితో స్నేహం చేయాలి. Tell me your company, I shall tell you what you are. మన 'కంపెనీ' ఎలాంటిదో మనము అలాంటివారిగా తయారవుతాము. కాబట్టి, మన 'కంపెనీ'ని మంచిగా పెట్టుకోవాలి. అయితే, 'గుడ్ కంపెనీ' (సత్సంగము) చిక్కటం చాలా అదృష్టం. మంచి కంపెనీలో చేరి మనము మంచి విషయాలనే అభివృద్ధిపరచుకుంటూ రావాలి. నిన్నటి దినం మన ఎమ్.బి.ఎ. పిల్లలు ఇద్దరూ చాలా చక్కగా మాట్లాడారు. ఆ పిల్లలు మాట్లాడుతుంటే నాకెంతో ఆనందం వేసింది. ఇలాంటి 'గుడ్ బాయ్స్' మన కాలేజీలో ఉండటం మనకెంతో ఆనందం. ఆ పిల్లలు ఎంతో చదివారు; అన్నింటియందు ఫస్టుక్లాసు సాధించారు; గోల్డ్ మెడల్ అందుకున్నారు. అయితే, కేవలం చదువులో ఫస్టుక్లాసు సాధించినంతమాత్రమున మీరు తృప్తి పడకూడదు. మీరందరూ 'గుడ్ బాయ్స్' (మంచి పిల్లలు) కావాలి. బంగారానికైనా వెల తగ్గుతుందికాని, మంచితనానికి ఏనాటికీ వెల తగ్గదు. కాబట్టి, మనం మంచితనాన్ని నేర్చుకోవాలి. అప్పుడే శాశ్వతమైన కీర్తిని గడిస్తాము.

**దృఢమైన విశ్వాసం కలవారికి భగవంతుడు ఎంతైనా సహాయం చేస్తాడు**

మొట్టమొదట మనకు ఆత్మవిశ్వాసం కావాలి. ఆత్మవిశ్వాసం ఉన్నటువంటి వారికి అంతా మంచే జరుగుతుంది. రాధ, ప్రహ్లాదుడు, ధ్రువుడు ఇలాంటి వారంతా

sri sathyasai vachanamrutam

మంచిభావాలతో జీవించారు. కనుకనే, వారికి అంతా మంచే జరిగింది. దుర్మార్గుడైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి ఎన్నోవిధాలుగా హింసించాడు; ఏనుగులచేత త్రొక్కించాడు. ప్రహ్లాదుడు 'నారాయణ, నారాయణ' అని స్మరిస్తూనే ఉన్నాడు. ఆ ఏనుగులుకూడా అతనికి నారాయణునిగానే కనిపించాయి. విష సర్పములచేత కరిపించాడు. ప్రహ్లాదుడు 'నారాయణ, నారాయణ' అంటుంటే ఆ విషమంతా ఎక్కడికి పోయిందో! అంతేకాదు, హిరణ్యకశిపుడు అతనిని పర్వతములపైనుంచి క్రిందికి నెట్టించాడు; సముద్రంలో పడద్రోయించాడు. అప్పుడుకూడా నారాయణుడు ప్రహ్లాదుణ్ణి రెండు చేతులతో పట్టుకొని క్షేమంగా ఇంటికి చేర్చాడు. ఈవిధంగా, భగవంతుణ్ని నమ్మినవానికి ఎప్పటికీ ఏనాటికీ ఎక్కడకూడను కీడు జరుగదు. కనుక, మీరందరూ అటువంటి దృఢమైన విశ్వాసమును అభివృద్ధి చేసుకోవాలి. ఆ విశ్వాసమే మీకు అన్ని విద్యలను నేర్పుతుంది. ఎక్కడ విశ్వాసమో అక్కడ ప్రేమ. ప్రేమ ఎక్కడో దైవమక్కడ. దైవానికి వేరే పేరు లేదు, రూపము లేదు. Truth is God, God is truth (సత్యమే దైవము, దైవమే సత్యము). సత్యమే ఈ ప్రపంచమునంతా సృష్టించింది.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబు నందణగె సర్వసృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య**

అదియే సాక్షాత్కారము. కనుకనే, సత్యాన్ని మనము గుర్తించాలి. కొంతమందికి దైవంపట్ల విశ్వాసం ఉంటుంది కాని, కొద్దిదినాలలో అది మార్పు చెందుతుంది. విశ్వాసము మారుతుంటే ఫలితముకూడా మారుతుంటుంది. నీకు సంపూర్ణమైన విశ్వాసం ఉంటే ఫలితంకూడా సంపూర్ణంగా మంచిదిగా ఉంటుంది. నీకు కొన్ని కష్టములు కలిగినప్పుడు ఆ ప్రేమను, విశ్వాసమును నీవు మరచిపోతావు. ఏమి జరిగినప్పటికీ విశ్వాసమును కోల్పోకూడదు. విశ్వాసమే మన శ్వాస కావాలి. అదే సరియైన పద్ధతి. నీ తల్లిదండ్రులను చూపించి 'వీళ్లు నీ తల్లిదండ్రులు కారు' అని ఎంతమంది ఎన్నివిధాలుగా చెప్పినప్పటికీ నీవు

srisathyasaivachanamrutam

ఒప్పుకోవు. 'వాళ్లు నా తల్లిదండ్రులే' అంటావు. అట్లే, భగవంతునిపట్ల నీ విశ్వాసముకూడా సంపూర్ణంగా ఉండాలి. కష్టము జరగనీ, నష్టము జరగనీ, ఇంకేవిధమైన ప్రమాదం జరగనీ! ఎట్టి పరిస్థితిలోనైనా నీ విశ్వాసం నిశ్చలంగా ఉండాలి. అంతటి దృఢమైన నమ్మకం కలిగినటువంటివానికి భగవంతుడు ఎంతైనా సహాయం చేస్తాడు.

తానీషా తనను చెఱసాలలో పెట్టినప్పుడు రామదాసు, "స్వామీ! నేను వసూలు చేసిన డబ్బంతా నీకే అర్పితం చేశాను కదా" అంటూ ఈ పాట పాడాడు:

**"లక్ష్మణునకు చేయిస్తి బంగారు మొలత్రాడు రామచంద్రా!**
**ఆ మొలత్రాటికి పట్టె పది వేల వరహాలు రామచంద్రా!**
**సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా!**
**ఆ పతకమునకు పట్టె పది వేల వరహాలు రామచంద్రా!**
**కలికితురాయి నీకు కుదురుగ చేయిస్తి రామచంద్రా!**
**ఎవడబ్బ సొమ్మని కులుకుతు తిరిగెదవు! రామచంద్రా!"**

వెంటనే మనస్సులో పశ్చాత్తాపపడ్డాడు.

**"అబ్బా తిట్టితినని ఆయాసపడవద్దు రామచంద్రా!**
**ఈ దెబ్బలకోర్వక అబ్బా తిట్టితినయ్యా రామచంద్రా!"**

"నీ పరీక్షకు తట్టుకోలేక నిన్ను తిట్టాను స్వామీ, నన్ను క్షమించు" అని కోరాడు. ఈవిధంగా క్షమాపణ కోరిన తక్షణమే ఇరువురు పిల్లలు (రామలక్ష్మణులు) రెండు బంగారు కాసుల మూటలు తీసుకొని తానీషావద్దకు వెళ్ళారు. అవి అతనికిచ్చి "మమ్మల్ని రామదాసు పంపించాడు" అని చెప్పారు. రామదాసుకు ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది అని తానీషా ఆశ్చర్యపోయి రామదాసును పిలిపించాడు. "ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది?" అని అడిగాడు. "రాజా! ఇది నేను పంపిన డబ్బు కాదు. ఈ పని రాముడే చేశాడు" అని చెప్పాడు, రామదాసు. ఈవిధంగా, భగవదనుగ్రహంతో ఏమైనా చేయవచ్చును. కనుక, మీరు ఏ పరీక్ష వచ్చినప్పటికీ దైవాన్ని నమ్మి పనిచేయండి. మీరు తప్పక ఆ పరీక్షలో ఉత్తీర్ణులవుతారు. విదేశీయులు ఎంత విశ్వాసము కలిగి ఉన్నారో తెలుసా? అనేకమంది పుట్టపర్తి గ్రామంలో

sri sathyasaivachanamrutam

చిన్నచిన్న గదుల్లో ఎంతో ఆనందంగా ఉంటున్నారు. వాళ్ళ ఆనందాన్ని వర్ణించటానికి వీలుకాదు. వాళ్ళ విశ్వాసము అంత గొప్పది. అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని మీరు పెట్టుకుంటే, ఎక్కడున్నా దైవము మీకు సహాయం చేస్తాడు.

**అడవులందున్న ఆకసమునన్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేట పడియున్న**
**దిక్కులేనివారికి దిక్కు దేవుడేను**

కనుక, మొట్టమొదట దైవవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఇది లేకుండా కేవలం నాలెడ్జిని పెంచుకుంటే ప్రయోజనం లేదు. సముద్రాలంతటి నాలెడ్జిని పెంచుకున్నావు. హిమాలయ పర్వతాలంతటి కామన్ సెన్స్‌ను పెంచుకున్నావు. కాని, ఎన్ని ఉండినప్పటికీ 'డిస్క్రిమినేషన్' (విచక్షణ) లేకపోతే అంతా వ్యర్థమే! "ఇది మంచిదా? చెడ్డదా? ఈ పని చేయతగినదా? చేయతగనిదా?" అన్న 'డిస్క్రిమినేషన్' ఒక్కటి ఉంటే చాలు, నీవు ఎంతైనా బాగుపడతావు. ఆ 'డిస్క్రిమి నేషన్'లోనే 'సెల్ఫ్ రియలైజేషన్' (ఆత్మసాక్షాత్కారము) ఇమిడి ఉంది. కనుక, మొట్టమొదట 'డిస్క్రిమినేషన్'ను నీవు సరియైనరీతిగా పెట్టుకోవాలి. ఒకే విషయాన్ని పదిమంది పదిరకములుగా 'డిస్క్రిమినేట్' చేస్తారు. అది 'ఇండివిజువల్ డిస్క్రిమినేషన్' – అనగా, స్వార్థ స్వప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని చేసేది. మనము స్వప్రయోజనాన్ని కాదు, సమాజ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అదే 'ఫండమెంటల్ డిస్క్రిమినేషన్'. అదే మనకు 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్' (ఆత్మతృప్తి) ఇస్తుంది. ఆ ఆత్మతృప్తియే ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తుంది. కనుక, ఆత్మసాక్షాత్కారానికి 'ఫండమెంటల్ డిస్క్రిమినేషన్' చాలా ముఖ్యం.

**మనో నిశ్చలతకు తోడ్పడునదే నిజమైన చదువు**

పిల్లల్లారా! మీరు చక్కని బంగారంవంటి పిల్లలు. కాని, మధ్యమధ్య కొన్ని అలలు, తెరలుగా 'నెగెటివ్ థాట్స్' వస్తున్నాయి. కాని, వచ్చినవి పోతుంటాయి. దానికి మనము ఏమాత్రం చలించకూడదు. ఎన్ని వచ్చినప్పటికీ వెరువకుండా నిశ్చలంగా ఉండాలి. మన 'స్టడీ' (చదువు) అనేది మనస్సును 'స్టెడీ' (నిశ్చలం)గా ఉండేటట్లు చేయాలి. Study to be

srisathyasaivachanamrutam

steady. దీనిని మీరు మనస్సులో భద్రము చేసుకోవాలి. ఆ ఇద్దరు పిల్లలు ఎంత ఆనందంగా ఉన్నారు! ఎమ్.బి.ఎ. పిల్లలు అందరూ మంచివారే. ఒకరు మంచి, ఒకరు చెడ్డ అని చెప్పడానికి వీలులేదు. వారి గానముకూడను ఎంతో చక్కగా, శ్రవణానందముగా ఉండినది. వారు చక్కని గుణవంతులు, బలవంతులు, బుద్ధిమంతులు. ఎక్కడ పోయినప్పటికీ వారి విలువ వారివెంటనే ఉంటుంది. మన కాలేజీలో అట్టి పిల్లలు తయారు కావాలి. వాళ్లు మన కాలేజీలో నిల్చిపోయి మిగితా పిల్లల్ని ఆవిధంగా అభివృద్ధి చేయాలి. ఏదో గొప్ప చదువులు చదివినామని విదేశాలకు పోయి దండిగా డబ్బు సంపాదించడం గొప్పతనం కాదు. Money comes and goes, morality comes and grows. అట్టి 'మొరాలిటీ'ని సంపాదించుకోవాలి. 'మొరాలిటీ' ఒక్కటి ఉంటే చాలు. ధనమేమి చేస్తుంది మనకు! కరెన్సీ నోట్లను తింటావా? కనుక, కరెన్సీ కాదు మనకు ముఖ్యము. 'డిస్క్రిమినేషన్' చాలా అవసరము; 'మొరాలిటీ' చాలా అవసరము. మొట్టమొదట దైవవిశ్వాసము, తరువాత ఉద్యోగము. పవిత్రమైన మన భారతీయసంస్కృతిని మీరు వదలిపెట్టకుండా అనుసరించాలి. దేశాభిమానమును ఏమాత్రం మరువకూడదు. దేశాభిమానము ఉంటే ఎంతైనా మనము సాధించవచ్చు. సుభాష్ చంద్రబోస్ విదేశాలకు పోయినప్పటికీ మాతృభూమిని ఏమాత్రము విస్మరించలేదు. 'ఇది నా మాతృదేశము' అని విద్యార్థులందరూ సగర్వంగా చాటాలి. దేశాన్ని మరువకుండా ఉండాలి. మన దేశ సంస్కృతిని మనము ఏమాత్రము పాడుచేయకూడదు. ఆ సంస్కృతియే మనకు అన్ని విధాలుగా సహాయం చేస్తుంది. 'బి హ్యాపీ'.

**(తేదీ 22.08.2007, స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజిమెంటు 21వ వార్షికోత్సవం, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vahamrutam